


**కథ**

అదొక తెలంగాణ పల్లె. రాత్రి మునుగుని తొలగించుకొని ఊరు తెల్లారింది. డిసెంబరు నెల చలి ఊరిని వణికిస్తోంది. ఆరు గంటలైనా చలికి భయపడి ఊరు ఇంకా బద్ధకంగా పడుకునే ఉంది. పశువుల కొట్టాల లోంచి బర్రెల అరుపులు, పాలు పితుకు తుంటె సర్రు సర్రుమని చప్పుళ్ళు విన్పిస్తు న్నాయి. ఆ ఊరిలో సగం పూరిళ్ళు, మిగతా సగంలో పెంకుటిళ్ళు ఉన్నాయి. ఒకటీరెండూ కూడా ఉన్నాయి. ఆ వాడకట్టులో అంతా శ్రమజీవులే. పొలాల్లో పనిచేసే జీతగాళ్ళు, కమ్మర్లు, మంగలివాళ్ళు, చాకలి వాళ్లు, రకరకాల వృత్తుల్లో జీవనం సాగించే వారి సముదాయం ఆ వాడ.

నరసవ్వ మెల్లిగా కళ్ళు తెరిచింది. తెరిచి చలికి వణికింది. చిన్న పాత గోనె సంచి మీద, ఓ చిరిగిన దుప్పటికి మునగదీస్కుని కప్పుకుంది. తల కప్పితే కాళ్లు చలికి వణుకు తాయి. కాళ్ళు కప్పితే తల చలికి ఎర అవుతుంది. చెట్టుపైన పక్షుల కిల కిల చప్పుళ్ళకి నరసవ్వ తల పైకెత్తి చూసింది. రావి చెట్టుపై పిట్టలు గోలగోలగా అరుస్తు న్నాయి. ఇక తప్పదన్నట్లు లేచింది నరసవ్వ. కాని పూర్తిగా లేవలేక పోయింది. అలాగే చెట్టుకి ఒరిగింది. తమ గుడిసె వైపు చూసింది. కోడలు ఇంకా లేచినట్లు లేదనిపించింది ఆమెకి. చలికాలం ఆరుబయట చెట్టుకింద సిమెంటు చప్టాపై పడుకొనే ఖర్మకి నరసవ్వ ఎప్పటిలానే బాధపడింది. చెట్టంత కొడుకున్నా తనకి చెట్టునీడే గతయింది. వెచ్చని కన్నీళ్ళు జాలిజాలిగా జారి అవి కూడా ఆమెతోపాటు చలికి వణికి తొణికాయి.

నరసవ్వ అరవై అయిదేళ్ళ ముదుసలి వివిధ రకాల జీవన వైవిధ్యాలకి, ఒక దీర్ఘకాలిక సంఘర్షణాత్మక జీవితానికి ఓ సజీవ సాక్షి. అనాదిగా ఆ ఊర్లో కొనసాగు తున్న కుల వివక్షతలకి, జాతి పరంగా పురుషాధిక్యతకి నలిగి నలిగి రాటుదేలిన, నరసవ్వ ఒళ్ళంతా ముడుతలతో, నడుము ఒకింత ఒరిగినా ధృడంగానే ఉంటుంది.

నరసవ్వకి ఆ ఊరితో యాభైమూడేళ్ళ అనుబంధం ఉంది. పన్నెండేళ్ళ చిన్ని నరిసి ఇరవై ఎనిమిదేళ్ళ ఎర్రన్న భార్యగా ఆ ఊళ్ళోకి అడుగుపెట్టింది. నరిసి అత్త మంగవ్వ. పరమ గయ్యాళిది. చిన్ని నరిసిని

ఆమె పెట్టని బాధలేదు. దానికి తోడు ఎర్రన్న తాగుబోతుతనం వల్ల సంసారంలో నరకాన్ని చిన్న వయసులోనే చవి చూసింది. తాగి ఇంటికొచ్చి నానా రభసచేసి నరిసిని కొట్టి తెలివుండి కోరికుంటే మత్తులోనే ఆమెని అనుభవించి గుర్రుకొట్టేవాడు. ఎర్రన్నికి నిద్ర లేవటంతోనే సారా నోట్లో పడాలి. సారాకోసం అతను ఇంటిని, ఇల్లాలిని సర్వనాశనం చేసాడు. స్వంత పెంకుటిల్లు కాస్త పూరి గుడిసెగా మారింది. నరిసి వంటిమీద ఆ కొద్ది నగలు ఆ ఊరి షావుకారి ఢిజోరిలోకి వెళ్ళిపోయాయి. తిండికీ బట్టకీ నరిసి రెక్కల కష్టమే ఆధారమైంది. మంగవ్వ నరిసిని బాధపెట్టి పెట్టి ఓపికలేక తానే చచ్చి పోయింది. అత్త బాధ తీరినా ఎర్రన్న బాధ పోలేదు. తాగుడు మానమని శతవిధాలా పోరినా వీల్లేకపోయింది. ఈ క్రమంలోనే నరిసి ఓ బిడ్డకి తల్లయింది. ఏ మాతృత్వ వాంఛ లేకుండానే. అవును మరి! ప్రకృతికి నరిసి కష్టాలతో, వాంఛలతో ఏం పని? అది ఎపుడు నిర్దేశించిన సూత్రాల ఆధారంగానే నడుస్తుంది. బిడ్డకి దశరథ్ అని పేరు పెట్టుకుంది నరిసి.

తాగుడికి డబ్బులివ్వని రోజు నరిసి ఎర్రన్న దెబ్బలకి బలయిపోవాల్సిందే. రాయిలా ఉండిపోయేది నరిసి. గత్యంతరం లేక ఆఖరి అస్త్రం ప్రయోగించేవాడు. వణుకుతూ కొంకర్లుపోతూ నరిసి కాళ్ళపై పడి వేడుకునేవాడు ఏడ్చేవాడు. అంటే నరిసి కరిగిపోయేది. భారతనారి కదా! జాలిపడి. వాడి బాధ చూడలేక తానే సారా కొనుక్కొచ్చి నోట్లో పోసేది. అలా ఓ రోజు నరిసి సారా తెచ్చి నోట్లో పోయకముందే ఎర్రన్న ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

ఎర్రన్న చనిపోయేనాటికి దశరథ్‌కి పదమూడేళ్ళు. వాడు చాలా చిల్లరగా పెరిగాడు. దొంగతనాలు, బీడీలు తాగడం, పేకాటలు, అపుడపుడు సారా తాగడం అలవాటయినాయి. నరిసి వాడ్ని బాది బాది "నీ తండ్రి లెక్క ఆగం గాకురా" అని ఏడ్చేది. దశరథ్ తాగాడని తెల్సినరోజు నరిసి భద్రకాళి అయ్యేది. అయినా ఫలితం ఆమె చేతిలో లేదు. అప్పటికి దశరథ్ ఎర్రన్న వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నాడు. వయసు మీరి ఒదిగిపోతున్న తల్లికి ఆసరాగా కాక ఓ గుదిబండలా తయారయ్యాడు.

ముసలి వయస్సులో ఆమే వాడ్ని మేపవల్సి వచ్చింది. పెళ్ళిచేస్తే బాగవుతాడని, ఎవరో సలహా ఇస్తే లక్ష్మితో పెళ్ళి జరిపించింది అయినా ఎక్కడి గొంగళి అక్కడే.

సారా మానెయ్యమని పోరే తల్లిని తాగుడికి, పేకాటకి డబ్బులివ్వలేదనే అక్కసుతో చావబాదేవాడు. కొట్టి కొట్టి "ఫో! ముసల్దానా" అని ఇంట్లోంచి తరిమేవాడు. నరిసి ఇంటి ముందున్న రావిచెట్టుని ఆశ్రయించేది. చెట్టు చుట్టు చప్టా ఉంది.




ఊడలు వేసి నాలుగువైపులా కిందికి వంగి ఓ ఇల్లులా తోచేది. ఆ చెట్టునీడ నరిసికి అమ్మ ఒడిలా ఆశ్రయమిచ్చేది. ఆ సిమెంటు చప్టామీద అమ్మ ఒళ్ళో కూర్చున్నట్లు అనుభూతి చెందేది. ఊడలు అమ్మ చేతులయ్యేవి. వాట్ని పట్టుకొని నరిసి స్వగతంగా ఎన్నో ఊసులు చెప్పేది, ఏడ్చేది. తర్వాత మౌనమై ఆ చిక్కనైన రావిచెట్టు నీడలో నిద్రపోయేది. పొద్దుటికి అన్నీ మర్చిపోయి ఇంటిని చేరేది. ఇట్లా చెట్టుని ఆశ్రయిస్తూనే ఉండేది నరిసి. ఎండాకాలం మాత్రం నరిసికి హాయిగానే ఉండేది. వర్షాకాలం, శీతాకాలంలో మాత్రం బాధలు పడేది.

ఇపుడు నరిసి బాగా ముసలిదయింది. నరిసి నరసవ్వగా మారింది. కొడుకు దురాగతాలు భరించలేక చెట్టునే శాశ్వతంగా ఆశ్రయించింది నరసవ్వ. కోడలు పిలిస్తే వెళ్ళి అన్నంతిని మళ్ళీ చెట్టుకిందికి చేరుతుంది. అందరూ ఆమెని 'చెట్టు నరసవ్వ' అని పిలుస్తారు. అలా చెట్టుతో ఆమెకి గాఢమైన అనుబంధం ఏర్పడిపోయింది. రోజూ చెట్టు పరిసరాలు శుభ్రం చేసుకొంటుంది. చెట్టంటె నరసవ్వకి ఎంతో ఆపేక్ష.

ఆంధ్రదేశం అంతటా గ్రామ గ్రామాన స్త్రీల సంఘటితంగా సారా ఉద్యమంలో పాల్గొంటున్నారు. ఆ సారా ఉద్యమ ప్రభావం నరసవ్వ ఊరిమీద కూడా పడింది. ఉద్యమం ముచ్చట్లన్నీ ఆ చెట్టుకిందే జరిగేవి. తన జీవితాన్ని సర్వనాశనం చేసిన సారా మహమ్మారికి వ్యతిరేకంగా ముసలి నరసవ్వ అత్యుత్సాహంగా తనని తాను ఉద్యమానికి అర్పితం చేసుకుంది. కల్లు కాంపౌండులపై దాడుల్లో శివంగిలా పాల్గొంది. స్త్రీల ఉద్యమ ఫలితంగా సారా మీద నిషేధం విధించింది ప్రభుత్వం. నరసవ్వ మళ్ళీ చెట్టుకి పరిమితమైంది. నిషేధం వెంబడే దొంగసారా కూడా ఊర్లోకి ప్రవహించింది. ఓ రాత్రి తాగివచ్చిన దశరథ్ గిలగిలకొట్టుకుంటూ నురగలు కక్కుకున్నాడు. ఆసుపత్రికి తరలించేలోపు దొంగ కల్తీసారా తన పని కానిచ్చేసింది. నరసవ్వ ఒక్క కన్నీటి చుక్క కార్చలేదు. కార్చడానికి కన్నీళ్ళుంటేగా? ఆమె కళ్ళు ఎపుడో ఇంకిపోయి పాషాణాలైనాయి. పైగా కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్న కోడలు లక్ష్మిని జాలిగా చూసింది.

'చెట్టంత' కొడుకు చనిపోతే ఒక్క కన్నీరు చుక్క కార్చని నరసవ్వ కాఠిన్యానికి ఊరంతా నివ్వెరపోయింది. కృత్రిమత్వానికి అలవాటు పడిన ఊరికి అంతకు మించి నరసవ్వ అర్థం అయ్యే అవకాశం లేదు. ఆ సాయంత్రం కొడుకుని ఖననం చేసాక మళ్ళీ చెట్టు పంచన చేరింది నరసవ్వ.

కొడుకు చనిపోయిన నాల్గునెలల

తర్వాత ఓ రోజు నరసవ్వని తట్టిలేపారు పొద్దేన్నే. ముసుగుతీసి చూస్తే గొడ్డళ్ళతో కన్పించారు నల్గురు మనుషులు. గొడ్డళ్ళతో ఎందుకొచ్చారో అర్థంకాని నరసవ్వ
"ఏంది నాగన్న! పొద్దుగాల్నే గీ గొడ్డన్లు దీస్కొని వస్తిరి?" ప్రశ్నించింది.
"ఏం లే నరసవ్వ, గీ చెట్టుని నరికెయ్యనీకి సర్పంచు బంపిండు" చెప్పాడు నాగన్న.
"ఏందేంది? గీ చెట్టుని నరికేతరా?" నరసవ్వ
"అవుమల్ల. చెట్టుని నరికినంక ఈ జాగాలో గాంధీబొమ్మ పెడ్తరట" చెప్పుకొచ్చాడు



నాగన్న.
"గాంధీబొమ్మ పెట్టుకోనీకి ఊర్ల జాగనే లేదా? ఈ చెట్టు జాగానే దొర్కిందా? ఎట్ల నర్కతారో నేను చూస్త. నా పానం బోయినా ఈ చెట్టుని నర్కనియ్య" నరసవ్వ చెట్టుని రక్షించుకోవడానికి సమాయత్తమవుతోంది.
ఈ లోగా చెట్టుని నరికే పనిని పర్యవేక్షించ డానికి సర్పంచు విఠల్‌రెడ్డి వచ్చాడు.
"ఏందిరా! నాగన్న ఇంకా పని మొదలు పెట్టలేదా?"
"ఏడ దొరా! ఈ ముసల్ది సాగనిస్తలేదు" నాగన్న.
"ఏమిట" ప్రశ్నించాడు విఠల్‌రెడ్డి
"చెట్టు నరకనియ్యదట. గాంధీ బొమ్మని ఊర్ల ఇంకా యాడనన్న మంచి జాగ జూస్కొని పెట్టుకోమంటున్నది" వివరించాడు నాగన్న.

"గాంధీకన్నా ఈ బోడి చెట్టు ఎక్కువనా. గా ముసల్దాని మాటలకేంగాని, నాగన్న! నరుకుడు మొదలుపెట్టండి" అని కూలీలకి హుకుం జారీ చేసి నరసవ్వ వైపు తిరిగి "ఛల్ నడు! మండలు విరిగి మీద బడ్డయంటె సచ్చిపోతవు. ఫో! మల్ల మామీద పోలీసు కేసవుతది" అన్నాడు విఠల్‌రెడ్డి.

కూలీలు చెట్టుని నరకడం మొదలెట్టారు నరసవ్వ వాళ్ళకి అడ్డం పడింది. "ఎదవ నా కొడుకుల్లారా! ఎవర్రా మీరు నా చెట్టుని నరకనీకి. నా చెట్టుమీద గొడ్డలి పడ్డదో మిమ్మల్ని నరికేత్తా" అంటూ శివంగిలా కూలీల మీద కలియబడింది వాళ్ళు నరసవ్వని విదిలించికొట్టారు. బూతులు తిట్టారు. "అది నా అవ్వరా. దాన్ని నరుక కండిరా" ఏడ్చుకుంటూ విఠల్‌రెడ్డి కాళ్ళమీద పడి "దొరా! నీ బాంచెను కాల్మొక్తా. నా చెట్టుని ఏమి చెయ్యకండి. గాంధి బొమ్మని ఇంకా యాడనన్నా పెట్టుండి" విలపిస్తూనే ఉంది.

విఠల్‌రెడ్డి విసుక్కుని "అరె నాగన్న! ఈ ముసిల్దాని గుంజుకుపోయి అవతల పారెయ్యి" హుకుం జారీ చేసాడు. వాళ్ళు ఆమెని బరబరా ఈడ్చుకుంటూ అప్పటికి గుమి గూడి చోద్యం చూస్తున్న జనం మధ్యలోకి విసిరేసారు.

నరసవ్వ వల వల ఏడ్వసాగింది. ఏడుస్తూనే శాపనార్థాలు పెడుతూ వుంది. "ఒరేయ్! గాంధీ బొమ్మ కోసం ఈ మొగులంత చెట్టుని నరుకుతార్రా. నా ఉసురు తగిలి సస్తార్రా మీరు" గుండెలు అవిసేలా శోకాలు పెట్టసాగింది. మూగిన జనం అంతా ఆశ్చర్యపోతున్నారు. "చెట్టంత' కొడుకు చచ్చిపోతే ఒక్క కన్నీటి చుక్క కార్చని నరసవ్వ - చెట్టుని నరుకుతుంటె కళ్ళలోంచి శోక సముద్రాన్ని పారిస్తూ తుఫాను రేపుతోంది. ప్రాణం పోతున్నట్లు విలవిల్లాడుతోంది. అవును మరి గాంధీగారు దేశానికేం చేసారో నరసవ్వకి తెలియదు. కాని చెట్టు తనకి చేసిన సేవ నరసవ్వకి తప్ప ఊరికి అనుభూతిలోకి వచ్చేది కాదు. అందుకే గాంధీ బొమ్మకన్నా చెట్టు ఉనికి ఆమెకి అంత ముఖ్యమైంది.

ఆ చెట్టుకూడా నరసవ్వ దుఃఖానికి స్పందిస్తున్నట్లే అన్పించింది. దాని ఒంటిమీద గొడ్డలి వేటు పడినపుడల్లా గాలిలో ఆ చప్పుడు అది నొప్పికి చేసే ఆక్రందనలా అన్పిస్తోంది. మండలు ఒక్కొక్కటిగా విరిగి పడిపోతున్నాయి. ఎన్నో ఏళ్ళుగా ఎందరికో ఆశ్రయమిచ్చిన ఆ మహావృక్షం మనిషి క్రూరత్వానికి నిస్సహాయంగా నేల వాలి పోయింది. అది నేల మీద పడినప్పుడు 'ధన్'మని చేసిన చప్పుడు నరసవ్వకు 'బిడ్డా' అన్న తల్లి ఆక్రందనలా తోచింది. నేలకి ఒరిగిన చెట్టుని చూస్తూ దుఃఖం భరించలేక వణుకుతూ చెట్టు దగ్గరికి పరుగెత్తి దాన్ని నిమురుతూ కుళ్ళి కుళ్ళి ఏడ్వసాగింది.

కన్న కొడుకుని - కట్టుకున్న మొగుడ్ని నమ్ముకున్న నరసవ్వకి ఏమీ మిగలనట్లే - బ్రతకటానికి నేలతల్లినీ, ఎదిగి విస్తరించ డానికా ఆకాశాన్ని ఆశ్రయించిన చెట్టుకు గొడ్డలి వేటు తప్ప ఇంకేమీ మిగల్లేదు.

నరసవ్వ మనిషిని నమ్మింది. కాని మనిషి ఆమెని చెట్టుకి అప్పచెప్పాడు. చెట్టు మనిషి నమ్మకాన్ని ఏనాడూ వమ్ము చేయలేదు. తన వేళ్ళు నేలతల్లి గుండెల దాకా విస్తరింప చేసి హుందాగా ఆకాశమంత ఎదిగి పుష్పించి, ఫలించి మనిషిని ఆదుకొని తన వృక్ష సంస్కృతిని మౌనంగా చాటి చెప్పింది. ఆఖరికి ఆ మనిషి చేతిలోని గొడ్డలి వేటుకి హుందాగానే నేలకి ఒరిగింది. భూమాత గుండెల్లో తన ఉనికిని వదిలి.

చెట్టు నరసవ్వని నిర్దాక్షిణ్యంగా పక్కకు తోసి కూలీలు చెట్టుని బరబరా ఈడ్చుకుంటూ వెళ్ళి బండిలో వేశారు. చెట్టుతో పాటు నరసవ్వ కూడా నేలమీద ఈడ్చుకుంటూ పోయింది. బండి కదిలి పోయింది. నరసవ్వ మిగిలిపోయింది ఒంటినిండా గాయాలతో.

సిమెంటు చప్టా తన చుట్టూ ఒక్కసారి ఆవరించిన శూన్యాన్ని భరించలేక చిన బోయింది.

చెట్టులేక బోసిపోయిన ఊరిని ఆకాశం వెక్కిరించింది.
చెట్టు నరసవ్వ - చెట్టులాగే కూలిపోయింది.

●